# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
VALUME: 16 ISSUE:152

తెలుగు దినపత్రిక


## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132, 247456,24745626

## కాంగ్రెస్,బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

హైదరాబాద్,నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు.


నల్లగొండ సంపుటి: 16 సంచిక :183 ఎడిటర్ : సయ్యద్ పాష తేది:గురువారం 06-08-2026 పేజీలు:4 వెల: 1.00


# బండి పదవికి గండి పడనుందా...




హైదరాబాద్,కేంద్ర మంత్రి బండి సంజయ్ కు సన్ స్ట్రోక్ తప్పేలా లేదు. బండిని మంత్రి పదవి నుంచి తొలగించడం ఖాయమని ఢిల్లీ మీడియా కోడై కూస్తుంది. ఈ నెల 15 వ తేదీన మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని ఢిల్లో పొలిటికల్ సర్కిల్ లో జోరుగా ప్రచారం కొనసాగుతుంది. కేంద్ర మంత్రులందరూ అందుబాటులో వుండాలని మంగళవారం పిలుపు రావడంతో బండి సంజయ్ హుటాహుటిన ఫ్లయిట్ ఎక్కి ఢిల్లీ చేరుకున్నారు. రెండు మూడు రోజులు అక్కడే ఉంటారని సన్నిహితులు చెబుతున్నారు. ఇప్పటికే బండి సంజయ్ ని రాజీనామా చేయమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదేశించినట్లు ప్రచారం జరుగుతుంది. బండి కుమారుడి వ్యవహారంలో తెలంగాణాలో పార్టీకి డ్యామేజ్ జరిగిందని, కనుక పదవి నుంచి తప్పుకోవాలని సూచించినట్లు తెలుస్తుంది. బండి మాత్రం రాజీనామా చేయకుండా మొండికేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి . ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్న మోదీ టీం మాట వింటే సరే సరి లేకపోతే నిర్మొహమాటం లేకుండా పదవి నుంచి తప్పిస్తామని సంకేతం ఇచ్చినట్లు సమాచారం.2021 జులై 7 వ తేదీన బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవిని చేపట్టారు. ఇటీవల కుమారుడు భగీరథ్ మీద పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది. సాక్షాత్తు కేంద్ర హోం మంత్రి కుమారుడు పోక్సో కేసులో జైలుకు వెళ్లి రావడం ప్రభుత్వానికి తద్వారా పార్టీకి చెడ్డపేరు వచ్చిందని ప్రధాని మోదీ భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటన తర్వాత కూడా ఆయనను పదవిలో కొనసాగిస్తున్నారు. జెన్ జీ క్రియాశీలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారే అవకాశం ఉన్నందున బండి మీద వేటు వేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. భగీరథ్ యవ్వారమే కాకుండా అవసరమైతే కొత్త రాజకీయ పార్టీ పెడతానంటూ బండి సంజయ్ చెప్పినట్లు వచ్చిన వార్తలను కూడా అధిష్టానం సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తుంది. కొత్త పార్టీ విషయాన్ని బండి ఖండించడమే కాకుండా చనిపోయాక తన మృతదేహం మీద బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అయినప్పటికీ అధిష్టానం క్షమించినట్లు లేదని విశ్లేషకులు చెబుతున్నారు.

# తెచ్చిన అనుమతులు రద్దయితయా..?




హైదరాబాద్, తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు హరీశ్ రావు.జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు.తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు.

# హైడ్రా కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసిన ఎనిమిది కాలేజీలు




హైదరాబాద్: హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ ఎన్ఓసిలు బయటకు వచ్చాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసి ఎన్ఒసిలు సృష్టించారు. ఎనిమిది ప్రైవేట్ కాలేజీలు ఫైర్ ఎన్ ఓసిపై రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్టు తెలుస్తోంది. ఇంటర్ బోర్డుకు ఎనిమిది కాలేజీలు సబ్మిట్ చేశాయి. ఎనిమిది కాలేజీలపై లేక్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయి. మరో 60కాలేజీల ఎన్ ఒసిలను స్క్రూటినీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎనిమిది కాలేజీలు గుర్తింపు రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. వివిధ సెక్షన్ల కింద 337, 336(3), 340(2), 318(4) , ఆర్/డబ్లు 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ ఆర్ నగర్, మెహదీపట్నం, బర్కత్ పురాలలో ఉన్న కాలేజీల యాజమాన్యం ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

# డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సెషన్



న్యూఢిల్లీ, ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన,మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఆగస్టు 17 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రస్తుత సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేయకపోవచ్చని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ప్రతిపాదిత సవరణలు ఆమోదం పొందేందుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అవసరమైన సంఖ్యా బలం సమకూరిన తర్వాత ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపాయి.

### రిజిజు అభ్యర్థనకు రాహుల్ నిరాకరణ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని ఆయన ఛాంబర్‌లో కలిశారు. డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు సహకరించాలని కోరారు. అయితే, కేంద్రమంత్రి అభ్యర్థనను కాంగ్రెస్ ఎంపీ తిరస్కరించారు. అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ, సీజేపీ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దుశ్చర్యలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన వెలువడే వరకు సభలో ఎలాంటి కార్యకలాపాలు జరగబోవని రాహుల్ స్పష్టం చేశారు. దీంతో పార్లమెంట్ ప్రతిష్టంభనపై చర్చించేందుకు కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు సమాచారం.

# కేంద్ర జలశక్తి, పర్యావరణ మంత్రులతో రేవంత్ భేటీ..



న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అనుమతులు, పొరుగు రాష్ట్రాలతో ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సాగింది. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ ఎంపీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు.

### తుమ్మిడిహెట్టి వివాదంపై జల్‌శక్తి అధికారితో చర్చలు

ముందుగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. ఈ భేటీలో ప్రధానంగా 'తుమ్మిడిహెట్టి' ప్రాజెక్టు నిర్మాణంపై చర్చించారు. ప్రాజెక్టు ఎత్తు పెంపు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రిని రేవంత్ రెడ్డి కోరారు.గతంలో 148 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే దానిని 150 మీటర్లకు పెంచేలా మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎత్తును 150 మీటర్లకు పెంచినా ముంపు ప్రభావం వెయ్యి హెక్టార్ల లోపే ఉంటుందని వివరించారు. అంతేకాకుండా, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే విద్యుత్ వినియోగంతో పనిలేకుండా గ్రావిటీ ద్వారానే నీటిని తరలించే అవకాశం ఉంటుందని జల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### పర్యావరణ అనుమతులపై భూపేందర్ యాదవ్‌తో భేటీ

ఆ తర్వాత కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి బృందం కలిసింది. తెలంగాణలో నిలిచిపోయిన పలు నీటిపారుదల ప్రాజెక్టులు, ప్రతిపాదిత రహదారుల నిర్మాణానికి అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు.

ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్ విఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు త్వరితగతిన పర్యావరణ అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితేనే రాష్ట్రంలో తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయని సీఎం స్పష్టం చేశారు.

# ఏడాదికి 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి: నితిన్ గడ్కరీ




న్యూఢిల్లీ: భారత్‌లో ప్రతి ఏడాది సగటును సుమారు 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాలకు బలి అవుతున్నట్లు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇవాళ ఆయన రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. చాలా బాధాకరమైన విషయమని, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి ఏడాది ఇండియాలో 1.80 లక్షల మంది మరణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించే అంశంపై చర్యలు తీసుకోవాలని ఎంపీ సుధానమూర్తి ప్రశ్న వేశారు. అందమైన రోడ్లు ఉన్నాయని, కానీ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ఇది రోడ్ల వల్ల కాదు అని, డ్రైవర్లు సరిగా నడపలేకపోవడం వల్లే అని సుధామూర్తి అన్నారు.జాతీయ రహదారులపై ప్రమాదాలను తగ్గించేందుకు ఆమె ఓ సూచన చేశారు. డ్రైవింగ్ లైసెన్సు ఇచ్చే ప్రక్రియ మరింత పటిష్టం చేయాలని సుధామూర్తి పేర్కొన్నారు. అయితే రోడ్డు ప్రమాదాల అంశంలో మనుషుల ప్రవర్తన చాలా ముఖ్యమైన అంశమని, డ్రైవింగ్ శిక్షణను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి గడ్కరీ తెలిపారు. టోల్ ప్లాజాల వద్ద వసూల్ చేస్తున్న ఛార్జీల గురించి మాట్లాడుతూ.. ఫాస్టాగ్, యూపీఏ పేమెంట్ల గురించి వివరించారు. టోల్ ప్లాజాలను పూర్తిగా ఎత్తివేసి, స్మూత్‌గా ప్రయాణాలు సాగే రీతిలో ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందన్నారు. మంచి సర్వీస్ కావాలంటే డబ్బులు చెల్లించాలని, అన్ని ఉచితంగా దొరకవు అని ఆయన తెలిపారు. టోల్ ప్లాజా నిబంధనలను ఆయన వివరిస్తూ.. ఫాస్టాగ్ లేని వారికి టోల్ ఫీజును నగదు రూపంలో చెల్లిస్తే రెండింతలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఒకవేళ హైవేలపై యూపీఐ ద్వారా టోల్ ఫీజు చెల్లిస్తే, 1.25 రెట్లు


# సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం...



హైదరాబాద్,రాష్ట్రంలోని మూలమూలల నుంచి విచ్చేసిన బాధితుల రద్దీతో గాంధీ భవన్ పరిసరాలు కిటకిటలాడాయి. 'ప్రజలే ప్రభుత్వానికి కేంద్రబిందువు' అనే ఉదాత్త భావనతో ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క స్వయంగా పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరించారు. ఊరట లభిస్తుందనే నమ్మకంతో వచ్చిన అర్జీదారుల సమస్యలను ఓర్పుతో, నేర్పుతో వింటూ వారి ఆవేదనకు అభయమిచ్చారు.తాత్సారానికి తావులేదు – అధికారులకు కఠిన ఆదేశాలు : వచ్చిన అర్జీలను ఏదో పైపైన చూసి పక్కన పడేసే పాత పద్ధతికి భిన్నంగా, ప్రతి అర్జీని మంత్రి సీతక్క క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటూ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో వేదిక నుంచే ఫోన్లలో నేరుగా మాట్లాడి సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నీళ్లు నమలకుండా, జాప్యం లేకుండా తక్షణమే చర్యలు చేపట్టి పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.స్పష్టమైన కార్యాచరణ... నిరంతర పర్యవేక్షణ : కేవలం ప్రజల బాధలు వినడమే కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని, బాధితుడికి సమస్య పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందించాలని సూచించారు. ప్రస్తుత ప్రజా పాలనలో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి అధికారీ చిత్తశుద్ధితో వ్యవహరించి, ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ.. అవగాహనతోనే మోసాలకు చెక్ : సీపీ సునీల్ దత్





ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 5 (దేశ టైమ్స్):సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల్లో అప్రమత్తత, అవగాహన కీలక పాత్ర పోషిస్తాయని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన "సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ లావాదేవీలు, యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ కొనుగోళ్లు విస్తృతంగా పెరగడంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయకుండా, ప్రతి ఖాతాకు ప్రత్యేకమైన బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలని, టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.కృత్రిమ మేధస్సు (ఏఐ)ను ఉపయోగించి నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ మొబైల్ యాప్‌లు, ఉద్యోగాలు, పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్‌లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, అపరిచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో పంచుకోవడం వంటి చర్యలు సైబర్ నేరాలకు దారితీస్తాయని హెచ్చరించారు.ప్రతి నెల వందలాది సైబర్ మోసాల ఫిర్యాదులు నమోదవుతున్నాయని, ప్రజలు లక్షల రూపాయలు కోల్పోతున్నారని సీపీ తెలిపారు. చదువుకున్నవారు సైతం నేరగాళ్ల మానసిక వ్యూహాలకు బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్‌బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, ఎస్సైలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

**గురువారం 06-08-2026**

# బహుజన చైతన్యానికి ముప్పు.. ఐక్యతే ఆయుధం!

రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా మరోసారి చర్చ ప్రారంభమైంది. ఒకవైపు సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం బహుజన వర్గాలు ఉద్యమిస్తుండగా, మరోవైపు 'రిజర్వేషన్ హఠావో' వంటి నినాదాలు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తు న్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రిజర్వేషన్ల అవసరం, సామాజిక అసమాన తలు, ఆధిపత్య రాజకీయాలపై మరోసారి చర్చించాల్సిన అవసరముంది. కుల అసమానతలు, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనల చరిత్రే భారత సామాజిక చరిత్ర. ప్రతి సామాజిక న్యాయ ఉద్యమం సమాజాన్ని ముందుకు నడిపించినప్పటికీ, దానికి ప్రతి స్పందనగా ఆధిపత్య రాజకీయాలు కొత్త రూపాల్లో పునరావృతమవుతూనే ఉన్నాయి.. నేడు కూడా ఒకవైపు రాజ్యాంగ విలువలు, సమాన హక్కులు, ప్రాతినిధ్యం కోసం బహుజన పోరాటాలు కొనసాగుతుండగా, మరోవైపు వాటిని నిర్వీర్యం చేసే శక్తులు వివిధ రూపాల్లో పనిచేస్తున్నాయి..

రాజ్యాంగ హక్కు దక్కుతుండడంతో..

రాజ్యాంగ విలువలతో సాగిన నీట్ పరీక్ష లీకేజీ ఉద్యమం దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి ప్రభుత్వాన్ని కదిలించింది. ఈ ఉద్యమం ఒక దళితుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో, ఒక ఆదివాసీ సోనమ్ వాంగ్ చుక్ స్ఫూర్తితో ప్రజ్వరిల్లింది. దీనికి ప్రతిఘాతకంగా ఇటీవల "రిజర్వేషన్ హఠావో ఆందోళన్" పేరుతో డిజిటల్ ఉద్యమం మొదలైంది. కుల ఆధారిత రిజర్వేషన్లను రద్దు చేసి, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.. దేశ రాజకీయ చరిత్రను పరి శీలిస్తే.. ఇప్పటివరకు ఈ సంఘటనలు రెండుసార్లు మాత్రమే జరిగాయి. ఉదాహరణకు ఒకటి 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి రావడంతో అగ్రకులాలు తమ అదనపు హక్కులు కోల్పోతున్నామని భావించి, ఎన్.డి. తివారి నాయకత్వంలో రాజ్యాంగాన్ని కాల్చి నిరసనకు దిగారు.. వేల సంఖ్యలో పార్లమెంట్ ముందు ధర్నాకు దిగారు.. రెండోది 1990లో మండల్ కమిషన్ అమలుకు వ్యతిరేకంగా కమండల్ పేరుతో దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. బీసీ రిజర్వేషన్ అమలును వ్యతిరేకించారు. ఈ రెండు సందర్భాల్లోనూ బహుజ నులకు భారత రాజ్యాంగం హక్కులైన విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు దగ్గరవడమే ప్రధాన కారణం.

ఇదో కృత్రిమ ఆందోళన..

దేశంలో ఇంకా కొనసాగుతున్న కుల వివక్ష, సామాజిక అసమానతలను విస్మరించి రిజర్వేషన్లను రద్దు చేయాలన్న డిమాండ్ న్యాయబద్ధమేనా? నేడు దేశం ముందున్న అత్యంత కీలకమైన ప్రశ్న. రిజర్వేషన్లు తొలగిస్తే కుల వివక్ష తొలగి పోతుందా? లేక వేల ఏళ్లుగా అణచివేతకు గురైన వర్గాలు మరోసారి అదే చీకట్లోకి నెట్టబడతాయా? అనేది ప్రశ్న. అయితే, శతాబ్దాలుగా కుల ఆధిపత్యాన్ని కొనసాగించినవారే ఇప్పుడు 'రిజర్వేషన్ హఠావో' అనడం అట్టడుగు వర్గాల అవ కాశాలను, చైతన్యాన్ని బలహీనపరచడానికి కుట్ర చేస్తూ ప్రజా ఉద్యమంగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు.. ఈ క్రమంలో రిజర్వేషన్ హఠావో ఉద్యమం సమానత్వానికా? ఆధిపత్యానికా ? అనే ప్రశ్నలు మేధావుల్లో తలెత్తుతున్నాయి. బహుజన యువత నాయకత్వంలో సీజేపీ ఉద్యమ విజయాన్ని ఓర్చుకోలేక అగ్ర వర్ణాలు "రిజర్వేషన్ హటావో" నినాదాన్ని ముందుకు తేవడం గమనార్హం. అగ్రకులాల తెరపైకి తీసుకొచ్చి కృత్రిమ ఉద్యమం ఇది. ఇది కేవలం రిజర్వేషన్లపై వివాదం కాదు, శతాబ్దాల ఆధిపత్యానికి సబ్బండ కులాల చైతన్యం విసిరిన సవాల్. ఈ నేపథ్యంలో అణగారిన వర్గాల ఐక్యత ఎంత బలపడితే, ప్రతి ఘటన అంత తీవ్రంగా ఉంటుందనే చారిత్రక సత్యాన్ని ఈ పరిణామాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

రిజర్వేషన్స్ దయ కాదు..

భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్స్ దానం కాదు, దయ కాదు, మెరిట్‌కు వ్యతిరేకమైనవి కూడా కాదు.. న్యాయ మైన అవకాశాలను కల్పించే ఈక్విటీ (సమన్యాయం) సూత్రం. చారిత్రకంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు సమాన స్థాయిలో పోటీపడే పరిస్థితులను కల్పిస్తుంది. శివుని సమానత్వం, బసవేశ్వరుని సమానత్వం కూడా ఇందులో ఇమిడి ఉంది. ప్రతి తలను లెక్కించి, ప్రతి ఒక్కరికీ సమాన వాటా దక్కేలా చేయడమే భారత రాజ్యాంగ గణతంత్ర స్ఫూర్తి. కానీ ఇప్పటికీ జనాభా దామాషా ప్రకారం సమాన అవకాశాలకు నోచుకొని అట్టడగు కులాలెన్నో ఉన్నాయి.. మెజారిటీ భూమి, సంపద, అధికారం ఇప్పటికీ కొన్ని కులాల చేతుల్లోనే ఉన్నప్పటికీ.. దాడి మాత్రం దళిత--బహుజనుల రిజర్వేషన్లపైనే ఇదెక్కడి సామాజిక న్యాయం? ఇది ప్రజాస్వామ్యం కాదు.. కులస్వామ్యమే.

90 శాతం ఇవ్వడమే.. సామాజిక న్యాయం!

ఇప్పుడు'''రిజర్వేషన్ హఠావో ఆందోళన్" బహుజన హక్కులను బలహీనపరిచి, వారి చైతన్యాన్ని దారి మళ్లించే అగ్రకుల రాజకీయమే అని అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో ఏర్పడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న 90 శాతం రిజర్వేషన్ల ఉద్యమం సామాజిక న్యాయానికి దిక్సూచి. సమ సమాజం, సమానత్వం అని నినదించే కమ్యూనిస్టు, నక్సలైట్ ఉద్యమాలు సైతం సామాజిక న్యాయ సాధనలో విఫలమయ్యాయి.. సమాజాన్ని ముందుకు నడిపేది ఆధిపత్య రాజకీయాలు కాదు, సమాన అవకాశాలే. రిజర్వేషన్లపై చర్చ కూడా అదే దృక్పథంతో సాగాలి. జనాభాలో ఎవరెంతో వారికంత వాటా చెందడమే ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్య స్ఫూర్తి. మెరిట్ పేరుతో బలవంతులే అవకాశాలు కొల్లగొట్టడం ఆటవిక సమా జ లక్షణం. చారిత్రక వెనుకబాటుతనాన్ని అధిగమించి ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన స్థానం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యం. అగ్రకులాలు ఈ సత్యాన్ని అంగీకరిస్తూ పరివర్తన చెం దాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ విముక్తి కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలు చేస్తున్న పోరాటాలను గౌరవించి మద్దతు ఇవ్వాలి. ఇదే మానవీయత, నిజమైన దేశభక్తి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత అర్థవంతంగా, సమగ్రంగా వికసిస్తుంది.

# వచ్చే ఎన్నికల్లో జెన్‌జెడ్‌దే కీలక పాత్ర



న్యూఢిల్లీ,జెన్‌జెడ్ యువత ఉద్యమం ఇప్పుడు ప్రభుత్వాన్నే కాదు, ప్రతిపక్షాలకు కూడా సవాలుగా మారింది. ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చే ఉద్యమం కాదు ఇది. వీరంతా పరిస్థితుల బట్టి, సమస్యల తీవ్రత బట్టి తమ ఓట్ల శక్తిని మార్చుకునే 'ఫ్లోటింగ్ ఓటర్లు'. అందువల్ల 2029 ఎన్నికల్లో వీరి ఓటు నిర్ణయం కీలక పాత్ర వహించే అవకాశం కనిపిస్తోంది. నీట్ పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీపై ఉధృతంగా సాగిన వీరి నిరసనలతో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆ తరువాత వీరి డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడం తదితర పరిణామాల ఫలితంగా వీరి నిరసనలు ముగిసినా, వీరి అసలు ప్రభావం రానున్న ఎన్నికల్లో తెలుస్తుంది. ఈ ఉద్యమం చాలా మంది యువ ఓటర్లను చైతన్యపర్చింది. ఎన్నికల్లో వీరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఇక ప్రతిపక్షాల సంగతి పరిశీలిస్తే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలను వారు ప్రభుత్వంపై పెల్లుబికిన అసంతృప్తిగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రజాగ్రహాన్ని రానున్న ఎన్నికల్లో తమకు ఓటుబ్యాంకుగా మార్చుకోవచ్చని ఆశపడుతున్నారు. వీరి అంచనా తప్పు కాకపోయినా అది అసంపూర్తి అని చెప్పవచ్చు. ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉండవచ్చు. కానీ అదే సమయంలో ప్రతిపక్షంపై కూడా ప్రజలకు పూర్తి నమ్మకం ఉందా? అన్నదే ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజావ్యతిరేకత రాజకీయంగా రూపాంతరం ఎలా చెందుతుందో నిర్ణయించేది ప్రతిపక్షం చూపించే ప్రత్యామ్నాయం, విశ్వసనీయత, నాయకత్వం, స్పష్టమైన కార్యాచరణే. నిజానికి ఒక నాయకుడు అంటూ లేకుండా, స్పష్టమైన సంస్థాగత నిర్మాణం లేకుండా, ప్రతిపక్షాలన్నింటి కంటే ముందుగా ప్రజాగ్రహాన్ని అందిపుచ్చుకుని కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది. మరి ప్రధాన విపక్షాలు ఏం చేయగలిగాయి? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల నిరసనలను సమీకరించి రాజకీయ సమీకరణాన్ని పూర్తిగా గేమ్‌ఛేంజర్‌గా వ్యూహాన్ని కాక్రోచ్ జనతా పార్టీ రూపొందించగలిగింది. మరి విపక్షం ఇలాంటి వ్యూహాన్ని రూపొందించగలదా? లేక సంప్రదాయ రాజకీయాలకే పరిమితమైపోతుందా? అలాగని ప్రతిపక్షాలు విజయాలు సాధించలేదని అనలేం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి మొత్తం 80 స్థానాల్లో 43 స్థానాలను గెలుచుకుని రికార్డు సాధించింది. బిజెపి 'అబ్ కి బార్ 400 పార్' అన్న నినాదంతో ముందుకు వెళ్లగా, ఆ విధంగా 400 సీట్లు బిజెపికి వస్తే రాజ్యాంగాన్ని మార్చి వేస్తుందని ఇండియా కూటమి విస్తృతంగా ప్రచారం సాగించి ప్రజల్లో బిజెపిపై అపనమ్మకాన్ని పెంచి గెలుపు సాధించింది. అయితే 2029 ఎన్నికల నాటికి పరిస్థితి ఇలా ఉండదు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ తన వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా జెన్‌జెడ్ యువతను చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను కొత్తగా తెరపైకి తెస్తున్నారు. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాలను 850 వరకు పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుతోపాటు లోక్‌సభ స్థానాల్లో మూడోవంతు సీట్లను వారికే కేటాయించడానికి యోచిస్తున్నారు. 2011 జనాభా ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజన చేస్తున్నారు. ఈ ప్రణాళిక అమలైతే 2029 ఎన్నికలకు ముందే భారత పార్లమెంటరీ వ్యవస్థలో దశాబ్దాల తర్వాత అతిపెద్ద మార్పు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలకు ఇప్పుడు గెలుచుకోవలసిన కీలక వర్గం జెన్‌జీ యువ ఓటర్లే. వీరు ఏ పార్టీకి శాశ్వతంగా కట్టుబడని ఓటర్లు అన్నసంగతి తెలిసిందే. భారతీయ కుటుంబాలు సంప్రదాయంగా ఒకే విధమైన రాజకీయ అభిప్రాయాలను కలిగి ఉండగా, జెన్‌జీ ఓటర్లు అభిప్రాయాలు మాత్రం వారికి భిన్నంగా ఉంటున్నాయి. వీరు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్ ఫారాలు, ఇంటర్నెట్, ఇన్‌స్టాగ్రామ్‌ల వంటి సమాచార సాధనాలతో మమేకం అవుతున్నారు. అందువల్ల తమ తల్లిదండ్రుల అభిప్రాయాలకు దూరంగా ఆలోచిస్తున్నారు. 2029 నాటికి దేశంలో జెనరేషన్ జెడ్ అతిపెద్ద ఓటరు వర్గంగా మారుతుంది. అప్పటివరకు మిలీనియన్స్‌ను అధిగమించి అత్యంత శక్తివంతమైన వర్గంగా జెన్‌జీ నిలుస్తుంది. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే 2029లో సుమారు 5 కోట్ల నుంచి 6 కోట్ల వరకు భారత యువత తొలిసారిగా ఓటు వేయబోతున్నారు. ఈ కొత్త ఓటర్ల వర్గం అనేక దేశాల మొత్తం జనాభా కన్నా ఎక్కువే. ఈ యువత ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా లేదు. ఉద్యోగ సమస్యలు, పరీక్షల్లో అవకతవకలు, కృత్రిమ మేధ వ్యాప్తితో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లడం, తదితర సమస్యలు వీరిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకనే ఏ రాజకీయ పార్టీ వచ్చినా తమ బతుకులింతే అన్న అసంతృప్తి వీరిలో నాటుకుపోయింది. జెన్‌జీ యువతలో కొందరు తమ ఉద్యమంతో ప్రభుత్వం దిగివచ్చి కేంద్ర విద్యామంత్రిని రాజీనామా చేయించిందని, మిగతా డిమాండ్లకు సానుకూలంగా స్పందించిందని, అందుకని తమ సమస్యలను పరిష్కరించగలదన్న ఆశతో ఉండగా మరికొందరు జంతర్ మంతర్‌లో నిరసనల సమయంలో, పార్లమెంట్ మార్చ్‌లో పోలీసులు తమపై సాగించిన దారుణ దమనకాండను గుర్తు తెచ్చుకుంటున్నారు. మేకులు తాపిన లాఠీలతో చితక బాదారని, బాష్పవాయు ప్రయోగించారని, ఇంటర్నెట్ నిలిపివేశారని, ఏమాత్రం విశ్వసత లేని ప్రచారాలు సాగించారని మండిపడుతున్నారు. మరికొంతమంది రాజకీయ నాయకులు అవకాశవాద వైఖరిని అసహ్యించుకుంటున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు కనిపించి, పరిస్థితులు కష్టంగా ఉన్నప్పుడు అదృశ్యమైన ఊసరవెల్లి నాయకుల తీరును ఎండగడుతున్నారు. ఈ చేదు అనుభవాలతో యువత ఎవరికి ఓటు వేయడానికి మొగ్గు చూపుతారో చెప్పలేం.

# పోతిన మహేష్ దారెటు...

విజయవాడ, పోతిన మహేష్ ప్రస్తుతం వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువ నాయకుడు. విజయవాడ రాజకీయాల్లో ఎదగాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆయనకు మంచి పట్టు ఉంది. జనసేన పార్టీ ద్వారా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. పవన్ కల్యాణ్ వీరాభిమానిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన రాజకీయ భవితవ్యం సంకటంలో పడింది. గత ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశించారు. కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానం బీజేపీకి కేటాయించారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. జనసేన పార్టీ వీడి వైసీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ ఆయనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. భవిష్యత్తు రాజకీయాలపై ఆయన మదనపడుతున్నారు. విజయవాడ పశ్చిమ సీటుపై పోతిన మహేష్ భారీ ఆశలు పెట్టుకున్నారు. గడచిన ఎన్నికలలో టికెట్ రాలేదు. ఇప్పుడు కూడా అదే సీటు కోరుకుంటున్నారు. అయితే వైసీపీలోనూ బలమైన నాయకులు ఉన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మళ్లీ అదే స్థానం ఆశిస్తున్నారు. దీంతో పోతిన మహేష్ పరిస్థితి క్లిష్టంగా మారింది. పార్టీ అధిష్టానం ఆయనకు గుంటూరు పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. ఆ బాధ్యతల పట్ల ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తనకు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ పదవి కావాలని కోరుతున్నారు. పార్టీ పెద్దలు ఆయన డిమాండ్ పట్టించుకోవడం లేదు. సొంత పార్టీలో తగిన గుర్తింపు లభించక సతమతమవుతున్నారు. వైసీపీలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో జనసేన నుంచి సంకేతాలు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోతిన కోసం జనసేన తలుపులు తెరిచే ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆయనను తిరిగి పార్టీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే గతంలో పవన్ కల్యాణ్ కుటుంబంపై పోతిన తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిణామం జనసేనలోని కొందరికి నచ్చడం లేదు. ఆయనను మళ్లీ పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. పార్టీలో ఆయనకు స్థానం దక్కడం కష్టమని కొందరు నేతలు భావిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాలు ఆయనను తీవ్ర గందరగోళంలో నెట్టేశాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గమనిస్తే పోతిన మహేష్ అడకత్తెరలో చెక్కపడ్డ చందంగా మారారు. వైసీపీలో ఉంటే పశ్చిమ సీటు దక్కేలా లేదు. జనసేనకు వెళితే గత విమర్శల కారణంగా వ్యతిరేకత ఎదురవుతోంది. రెండు పార్టీల మధ్య నలిగిపోతున్న ఆయన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విజయవాడ రాజకీయాల్లో తన స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆయన తపన పడుతున్నారు. కానీ పరిస్థితులు ఆయనకు అనుకూలంగా మారడం లేదు. అనుచరులు మాత్రం ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుంది. రాజకీయ ప్రయోజనాలు నెరవేరక పోవడంతో పోతిన మహేష్ తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థుల వ్యూహాల కారణంగా ఆయన నియోజకవర్గంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లోకి వెళ్దామంటే స్పష్టమైన హామీలు కరువయ్యాయి. భవిష్యత్తు కార్యాచరణపై సన్నిహితులతో చర్చిస్తున్నారు. ఏ పార్టీలో కొనసాగాలనేదానిపై త్వరలోనే స్పష్టత ఇస్తారని ప్రచారం జరుగుతోంది. విజయవాడ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ఆయన ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి. మొత్తంగా ఆయన రాజకీయం అత్యంత కీలకమైన మలుపు తిరిగింది.

# అదిలాబాద్ కాంగ్రెస్ లో అలజడి..!



అదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అనూహ్య అలజడి మొదలైంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలలో ఒకరు ఆదివాసీల హక్కుల రక్షణ పేరుతో ప్రభుత్వం తీరును ప్రశ్నించగా..మరో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాత్రం అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటుండటం హాట్ టాపిక్ గా మారింది. ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్నారంలో అటవీ అధికారుల తీరుపై తిరుగుబాటు ప్రకటించడం కలకలం రేపింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందనపల్లి ప్రాంతం వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఆదివాసీ యువకులను కొట్టిన అటవీ శాఖ అధికారులపై 24 గంటల్లో చర్య తీసుకోకుంటే ప్రభుత్వానికే వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమం చేస్తానని ఎమ్మెల్యే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆదివాసీలపై చేయి చేసుకున్న ఇంధన్ పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తపాలాపూర్, ఉడుంపూర్, ఖానాపూర్ రేంజ్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడిన వెడ్మ బొజ్జు అటవీశాఖ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఖానాపూర్ నియోజకవర్గంలోనే ఒక వ్యతిరేక సామ్రాజ్యం ఏర్పాటు చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్న ఆదివాసీ యువకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జరిగిన రాస్తారోకోలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనడం గమనార్హం.

ఆదివాసీల రాజ్యం కోసం పోరాటం

అటవీశాఖ అధికారులు ఆదివాసీల పట్ల తమ అణిచివేత వైఖరి మార్చుకోకపోతే కవ్వాల్ టైగర్ జోన్ ప్రారంభమైన జన్నారం నుంచే అటవీశాఖకు వ్యతిరేక ఉద్యమానికి పునాది వేస్తామని వెడ్మ బొజ్జు హెచ్చరించారు. అడవిలోకి ప్రజలను రానివ్వని అధికారులు... రెవెన్యూ భూముల్లోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని వెడ్మబొజ్జు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వానికి వ్యతిరేక సామ్రాజ్యం ఏర్పాటు చేయడంతో పాటు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని, ఉద్యమాన్ని ఖానాపూర్ నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని, ఆదివాసీల రాజ్యం తీసుకొస్తానని హెచ్చరించారు.

దిగొచ్చిన సర్కార్..ఇందన్ పల్లి ఎఫ్ ఆర్ వో సస్పెండ్

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు డిమాండ్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చింది. ఆదివాసీలపై చేయి చేసుకున్న ఇంధన్ పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించింది. దీంతో ఈ విషయమై ఆదివాసులు ఇక సంయనం పాటించాలంటూ ఎమ్మెల్యే బొజ్జు విజ్ఞప్తి చేశారు.

ప్రేమ్ సాగర్ రావుపై సంచలనం రేపుతున్న అవినీతి ఆరోపణలు

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై తాజాగా వచ్చిన అవినీతి ఆరోపణలు ఆ జిల్లాలో సంచలనంగా మారాయి. ప్రేమ్ సాగర్ రావు కుటుంబానికి చెందిన వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు ఆరేళ్లలో 11కంపెనీల పేరిట 9 బ్యాంకుల నుంచి రూ. 470 కోట్ల అప్పులు తీసుకున్నాయని, అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో ఆ సంస్థలను బ్యాంకర్లు డిఫాల్టర్లుగా ప్రకటించారని ఆయన రాజకీయ ప్రత్యర్థులు బయటపెట్టారు. ఎన్సీఎల్టీలో కేసులు కూడా నడవడంతో పదేళ్ల పాటు వారికి నోటీసులు కూడా జారీ కాబడ్డాయని, అయితే 2023లో గెలవగానే ప్రేమ్ సాగర్ రావు రూ. 450 కోట్ల అప్పు క్లియర్ చేశారని, గెలిచిన రెండున్నరేళ్ల లోపునే రూ. 450 కోట్లకుపైగా అప్పులను ఆయన ఎలా చెల్లించారంటూ ప్రశ్నిస్తున్నారు. మార్చి 24న బంజారాహిల్స్ నికో బ్రాంచ్ లో ఒక్క రోజునే రూ.120కోట్లు ఒకేసారి చెల్లించి ఎన్ వోసీ పొందారని, ఎమ్మెల్యే కుటుంబానికి చెందిన ఓ ప్రైవేట్ హోటల్ పేరిట ఉన్న రూ.87కోట్ల అప్పును కూడా క్లియర్ చేశారని ఆరోపిస్తున్నారు. ప్రేమ్ సాగర్ రావు అఫిడవిట్ ప్రకారం 2018లో రూ. 26 కోట్లు.. 2023లో రూ. 54 కోట్ల ఆస్తులు ఉన్నాయని, 2023లో ఎమ్మెల్యేగా గెలిచాక అన్ని వందల కోట్ల అప్పులు ఎలా చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రెండున్నరేళ్లుగా ప్రేమ్ సాగర్ రావు యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ, ఇసుక దందా, బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యేపై దాదాపు 40కి పైగా క్రిమినల్ కేసులు.. అందులో భూకబ్జాలు, బెదిరింపులు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. కాప్రా భూకబ్జాలో ఎమ్మెల్యే పేరు వినిపించిందని.. బాధితులు గాంధీభవన్‌ను ముట్టడించారని గుర్తు చేస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రూ. 500 కోట్ల అక్రమాలు జరిగాయని, భూసేకరణ కోసం దళితులను బెదిరించి, బలవంతంగా ఎకరా రూ. 13 లక్షలకే భూములు లాక్కుని ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకున్నారని ప్రేమ్ సాగర్ రావుపై గతంలో ఆరోపణలు ఉన్నాయని వారు వెల్లడిస్తున్నారు. పూర్తయిన పనులకు కూడా మళ్లీ టెండర్లు పిలిచి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని ప్రత్యర్థులు ఆరోపించారు. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్వతంత్ర శైలితో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లయ్యింది. ఎమ్మెల్యేల వ్యవహారం కాంగ్రెస్ రాజకీయాల్లో కలకలం రేపింది. ప్రేమసాగర్ రావు బ్యాంకుల రుణ బకాయిల చెల్లింపులపై సందేహాల నేపథ్యంలో ఆయన సంస్థలపై ఈడీ, సీబీఐలకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నేత వెరబెల్లి రఘునాథ్ రావు వెల్లడించారు.

# మిడిల్ క్లాసు కష్టాలు...

హైదరాబాద్ ,ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు. ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు. గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

## ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా

కాకినాడ, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతు ల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

# సింగరేణిని కాపాడందుకు కేంద్రం పార్లమెంట్ లో బిల్లు చెయాలి

హైదరాబాద్,మణుగూరు ఓపెన్ కాస్ట్ -2 సింగరేణి కి దక్కడం మంచి పరిణామం. మణుగూరును కాపాడినందుకి సీఎం, డీసీఎం ధన్యవాదములని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి డీప్ బ్లాక్ ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. సింగరేణి ప్రైవేటీకరణ అడ్డుకట్ట వేయడానికి సీఎంకు వినతి లెటర్ ఇచ్చి - సీఎంను కలిసి మాట్లాడారు. సింగరేణి నష్టాలను చూపించి ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు కుట్రలు ఇంకా జరుగుతున్నాయి. సింగరేణి అభివృద్ధి చేస్తా అని కేసీఆర్ వైఫల్యం అయ్యారు - ఇప్పుడు కేసీఆర్ లెక్క కాకుండా సింగరేణిని అభివృద్ధి చేయాలని అన్నారు.సింగరేణిని కాపాడందుకు కేంద్రం పార్లమెంట్ లో బిల్లు చెయాలి. సింగరేణి పై దూరదృష్టి లేకపోతే తెలంగాణలు నష్టం జరుగుతుంది. సింగరేణి పై బ్లూ ప్రింట్ తయారు చేయాలి కోరుతున్నా. సింగరేణికి ప్రభుత్వం 56వేల కోట్లు అప్పు ఉంది... ప్రభుత్వం ఆ నిదులను విడుదల చేయాలి. సింగరేణిని కాపాడెందుకు మేము ఉద్యమం చెస్తాం - ప్రభుత్వం ఈగోకు పోకుండా సమ్మె పై ప్రభుత్వం చర్చలు సఫలం చేయాలి.

# తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యార్థుల కరువు

హైదరాబాద్,తెలంగాణాలో ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల వేటలో పడ్డాయి. కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటా సీట్లు భర్తీ కాకపోవడంతో ఏమి చేయాలో తోచక తలపట్టుకుంటున్నాయి. ఇప్పటికే రెండు విడతల కౌన్సిలింగ్ అయిపోయింది. శుక్రవారం నుంచి మూడో విడత చివరి కౌన్సిలింగ్ జరుగుతుంది. ఇంకా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకోని విద్యార్థులు వెంటనే స్లాట్ బుక్ చేసుకొని హెల్ప్ లైన్ కేంద్రాలకు వెళ్లాలని యాజమాన్యాలు బతిమాలుతున్నాయి. అయినా సరే పూర్తి సీట్లు భర్తీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదని యాజమాన్యాలు దిగులుపెట్టుకున్నాయి.తెలంగాణాలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటాలో 22,972 సీట్లు మిగిలిపోయాయి. మేనేజ్మెంట్ కోటాకు కూడా భారీగా డిమాండ్ తగ్గినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో మొత్తం 94,424 సీట్లు ఉండగా రెండు విడతలుగా జరిగిన కౌన్సిలింగ్ లో 71,452 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్లు భర్తీ కావడానికి ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు కొత్త దారులు వెదుకుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ విషయంలో కన్సల్టెంట్లు కీలక పాత్ర పోషిస్తుంటారన్నది బహిరంగ రహస్యం. జూనియర్ కాలేజీ నిర్వాహకులు, అక్కడ పనిచేసే లెక్చరర్ల ద్వారా విద్యార్థులను ఆకర్షిస్తుంటారు. అయితే కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలలు గత కొన్నేళ్లుగా వారిని దగ్గరకు రానివ్వడం లేదు. ఇప్పుడు పరిస్థితి తలకిందులు కావడంతో పెద్ద కాలేజీలు సైతం కన్సల్టెంట్ల వద్దకు పరుగులు తీస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.నిన్నా మొన్నటి దాకా యాజమాన్యం ఇచ్చింది తీసుకొన్న కన్సల్టెంట్ల పంట పండింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటాలో ఐదు సీట్లు భర్తీ చేసిన వారికి రెండు సీట్లు ఉచితంగా ఆఫర్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎల్బీ నగర్, హయత్ నగర్ ప్రాంతాల్లోని కాలేజీలు ఒక అడుగు ముందుకేసి ఒకటికి ఒకటి ఉచితం అంటూ ఊరిస్తున్నట్లు సమాచారం. బాచుపల్లి, నిజాం పేట్, ఘట్ కేసర్ ప్రాంతాల్లోని కాలేజీలు సైతం మేనేజ్మెంట్ కోటా భర్తీ చేయడానికి కన్సల్టెంట్ల చుట్టూ తిరుగుతున్నట్లు చెబుతున్నారు.

# వేమండలో '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం'

గన్నవరంఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం ? అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ - కలవపాముల, తరిగొప్పల - మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడి, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు, రూ.12 లక్షలతో వ్యవసాయ విద్యుత్ సేవల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ.1.70 కోట్లుఅవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఏసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూర్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టిన ప్రైవేటు బస్సు

ఉంగుటూరు, ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చెన్నై నుంచి వైజాగ్‌కు 25 మంది ప్రయాణికులతో వెళ్తున్న 'బి.ఎల్.ఎమ్' ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం రహదారిపైనే పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది గాయపడగా, వారిలో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా అరుపులు, కేకలతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్లే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిందని ఘటనా స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే ఉంగుటూరు పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను బస్సు అద్దాలు పగలగొట్టి వెలుపలికి తీశారు. గాయపడిన 18 మంది స్వల్ప గాయాలతో బయటపడగా, తీవ్రంగా గాయపడిన ఏడుగురిని తక్షణ చికిత్స నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే స్పందించి క్రేన్ సహాయంతో బోల్తా పడిన బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# మానవ తప్పిదాలతోనే ఈశాన్యం మునక



అసోం:ఎగువ అసోంలో ఇటీవల సంభవించిన విధ్వంసకర ఆకస్మిక వరదలు అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి మరో నిదర్శనంగా నిలిచాయి. ఈ వరదలతో ఎగువ అసోం, దిగువ అసోం, మేఘాలయ మధ్య కీలక రవాణా మార్గాలు తెగిపోయాయి. ఈ వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నది, దాని ఉధృత ఉపనదులు గట్లను దాటి ప్రవహించడంతో ప్రధాన రహదారులు, వంతెనలు నీటమునిగాయి. గువాహటి వంటి ప్రధాన నగరాలు వరద ముప్పులో చిక్కుకున్నాయి. అయితే ఈ విపత్తును 'క్లౌడ్ బరస్ట్'గా అంటే అనివార్యమైన ప్రకృతి వైపరీత్యంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. కానీ ఈ విపత్తును కేవలం ప్రకృతి సృష్టించిన ప్రమాదంగా పేర్కొనడం అసలు కారణాలను కప్పిపుచ్చడమే అవుతోంది.భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందిన విధానాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలను క్రమంగా బలహీనపరచడం వంటి మానవ చర్యలే ఎగువ అసోంలో ఈ భారీ వరదలకు ప్రధాన కారణాలుగా మారాయి. శివసాగర్, చరైదేవో, జోర్హాట్ జిల్లాల్లో సంభవించిన తీవ్ర నష్టం కూడా ఈ విధానాల ఫలితమే. కొండలు, లోయలతో కూడిన అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థను సహజ సంపదగా కాకుండా వాణిజ్య లాభనష్టాల కోణం లో చూడటమే ఈ పరిస్థితికి దారితీసింది. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లలో నదులపై ఇప్పటికే వందకు పైగా జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా, మరెన్నో ప్రణాళిక దశలో ఉన్నాయి.వర్షాకాలంలో జలాశయాలు నిండిపోతే, తమ కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను కాపాడుకునేందుకు ఎగువ ప్రాంతాల నిర్వాహకులు ఎలాంటి సమన్వయం లేకుండానే భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతమైన ఎగువ అసోం కృత్రిమ ఆకస్మిక వరదలకు నిలయంగా మారుతోంది. దీనికి తోడు నియంత్రణ లేకుండా సాగుతున్న బొగ్గు తవ్వకాలు, అక్రమంగా కొండలను తొలగించడం, భారీ స్థాయిలో రాతి క్వారీల నిర్వహణవల్ల లక్షల టన్నుల మట్టి నదుల్లోకి చేరుతోంది. దిఖౌ, దిసాంగ్, ఝాంజీ వంటి నదులు మట్టితో నిండిపోవడంతో వాటి నీటిని మోసుకెళ్లే సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా భారీ వర్షాలు కురిసిన వెంటనే ఈ నదులు గట్లను దాటి పరిసర ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి.ఈ ఏడాది వర్షాకాలం సృష్టించిన బీభత్సం మానవ, ఆర్థిక నష్టాల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎఎస్‌డిఎంఎ) గణాంకాల ప్రకారం, భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి విడుదలైన నీటి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 82 మంది ప్రాణాలు కోల్పోయారు. పది లక్షలకు పైగా ప్రజలు వరదలతో తీవ్రంగా ప్రభావితమయ్యారు. 21,523 హెక్టార్లకు పైగా నిలువ పంటలు నీటమునిగాయి. 11 వేలకుపైగా పశువులు, కోళ్లు మృతి చెందడంతో గ్రామీణ కుటుంబాలు తమ ప్రధాన జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.ఈ 'మానవ సృష్టి వరదల' వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవాలంటే ఈశాన్య భారతంలో గతంలో జరిగిన ఘటనలను పరిశీలిస్తే సరిపోతుంది. నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌ఇఇపిసిఒ) నిర్వహిస్తున్న 405 మెగావాట్ల రంగనది జలవిద్యుత్ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రంగనది జలాశయం నుంచి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే అదనపు నీటిని ఒక్కసారిగా విడుదల చేయడం వల్ల అసోంలోని లఖింపూర్, ధేమాజీ జిల్లాలు తరచూ వరదల బారిన పడుతున్నాయి. గ్రామాలు కొట్టుకుపోవడంతోపాటు సారవంతమైన వ్యవసాయ భూములు మందపాటి ఇసుక పొరలతో కప్పుకుపోయి సాగుకు పనికిరాకుండా మారుతున్నాయి.హిమాలయ ప్రాంత నదుల వ్యవస్థ ఎంత సున్నితమైనదో సిక్కింలోని చుంగ్‌థాంగ్ వద్ద తీస్తా 3 ఆనకట్ట కొట్టుకుపోయిన ఘటన మరోసారి చాటిచెప్పింది. హిమ సరస్సు విరిగిపోవడంతో ఏర్పడిన ఆకస్మిక వరద ధాటికి ఈ భారీ ఆనకట్ట క్షణాల్లోనే కొట్టుకుపోయింది. అనంతరం ఉధృతంగా వచ్చిన వరద నీరు సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లోని అనేక పట్టణాలను ముంచెత్తింది. డజన్ల కొద్దీ వంతెనలు ధ్వంసమయ్యాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎగువ ప్రాంతాల్లో చేపట్టే భారీ ప్రాజెక్టులు భౌగోళిక ప్రమాదాలను విస్మరిస్తే, దాని మూల్యం దిగువ ప్రాంతాల ప్రజలే ప్రాణాలతో, ఆస్తులతో చెల్లించాల్సి వస్తుందనే విషయాన్ని ఈ విపత్తు స్పష్టం చేసింది. అసోంలోని వరదలు, మహారాష్ట్రలోని భివండిలో భవనాలు కూలిపోవడం, ముంబైలో చెట్లు కూలి ప్రాణనష్టం సంభవించడం వంటి ఘటనలన్నింటికీ ఒకే తరహా పాలనా వైఫల్యం కనిపిస్తోంది. ప్రజల భద్రత కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఇటువంటి విపత్తులు చోటుచేసుకుంటున్నాయి.గత పదేళ్లలో పర్యావరణ చట్టాలను పెద్ద వ్యాపార సంస్థలకు అనుకూలంగా మార్చడం ద్వారా కఠిన నియంత్రణ వ్యవస్థలను నామమాత్రంగా మార్చేశారు. ముఖ్యంగా పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నోటిఫికేషన్ వ్యవస్థను క్రమంగా బలహీనపరచడం వల్ల ప్రకృతి పరిరక్షణకు ఉన్న కీలక అడ్డుకట్టలు తొలగిపోయాయి. వివాదాస్పద సవరణల ద్వారా ప్రభుత్వం' ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్' (పనులు పూర్తయిన తర్వాత పర్యావరణ అనుమతి) విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనివల్ల ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండానే జలవిద్యుత్, గనులు, పారిశ్రామిక ప్రాజెక్టులను నిర్మించి నిర్వహించే అవకాశాన్ని కంపెనీలు పొందుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించినా తర్వాత స్వల్ప జరిమానా చెల్లించి అక్రమ నిర్మాణాలను చట్టబద్ధం చేసుకునే వెసులుబాటు కల్పించారు.దీంతో పర్యావరణ పరిరక్షణ స్థానంలో 'డబ్బు చెల్లించి కాలుష్యం సృష్టించే' విధానం అమలవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల భాగస్వామ్యాన్ని కూడా క్రమంగా బలహీనపరిచారు. భారీ ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయ సేకరణకు ముందుగా ఇవ్వాల్సిన గడువును 30 రోజుల నుంచి 20 రోజులకు తగ్గించారు. దీంతో ముఖ్యంగా ఆదివాసీ, మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక వివరాలను పూర్తిగా పరిశీలించి తమ అభిప్రాయాన్ని వెల్లడించే అవకాశం తగ్గిపోయింది. అంతేకాకుండా అనేక భారీ ప్రాజెక్టులను ప్రభుత్వం 'వ్యూహాత్మక ప్రాజెక్టులు' గా ప్రకటించే వెసులుబాటు కల్పించడంతో, వాటిపై ప్రజా పర్యవేక్షణ, పారదర్శకత, ప్రజాస్వామ్య పరిశీలనకు తావు లేకుండా పోతోంది.తాజాగా ప్రతిపాదించిన సవరణల ప్రకారం, ప్రభుత్వం ఎంపిక చేసిన అధికారులతో ప్రత్యేక శాశ్వత కమిటీలను ఏర్పాటు చేసి, స్వతంత్ర నిపుణుల కమిటీల (ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీలు ఇఎసిలు) పాత్రను పక్కనపెట్టి కార్పొరేట్ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చే విధానాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈశాన్య భారత భౌగోళిక పరిస్థితులు దక్కన్ పీఠభూమి, దక్షిణ భారత తీర ప్రాంతాలతో పూర్తిగా భిన్నంగా ఉన్నప్పటికీ, పాలనా వైఫల్యాల తీరు మాత్రం దేశవ్యాప్తం ఒకేలా కనిపిస్తోంది. అసోంలో మానవ తప్పిదాల వల్ల సంభవించిన వరదలకు దక్షిణ భారత నగరాల్లో చోటుచేసుకున్న పట్టణ విపత్తులు అద్దం పడుతున్నాయి. కార్పొరేట్‌రాజకీయ వ్యవస్థల కుమ్మక్కు, పరిపాలనా నిర్లక్ష్యం దేశమంతటా ఒకే విధంగా కొనసాగుతున్నాయనే విషయాన్ని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.హైదరాబాద్‌లో ప్రతి వర్షాకాలంలో ఐటి కారిడార్లు, నివాస కాలనీలు జలమయం కావడానికి ప్రధాన కారణం నగరంలోని చారిత్రక గొలుసు చెరువుల (చైన్ ఆఫ్ లేక్స్) వ్యవస్థను క్రమంగా ధ్వంసం చేయడమే. రియల్ ఎస్టేట్ ఒత్తిళ్లతో వేలాది సహజ చెరువులు, వాటి నీటి ప్రవాహ మార్గాలైన నాలాలను కాంక్రీటీకరించడంతో వర్షపు నీరు వెళ్లే మార్గాలే లేకుండా పోయాయి. గువాహటిలోని దీపోర్ బీల్ చిత్తడి ప్రాంతం నాశనమైన తీరు కూడా ఇదే పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఉత్తర భారతంలో కార్పొరేట్ మద్దతుతో నిర్మించే భారీ జలవిద్యుత్ ప్రాజెక్టులైనా, దక్షిణ భారతంలో రియల్ ఎస్టేట్ ఆధారిత ఆక్రమణలైనా సహజ జలవ్యవస్థను గౌరవించడంలో ప్రభుత్వాలు విఫలమైతే ఫలితం ఒక్కటే. నష్టాలు మాత్రం ప్రజలపై పడుతుండగా, లాభాలు ప్రైవేటు సంస్థలకే పరిమితమవుతున్నాయి. ప్రకృతిని కార్పొరేట్ సంస్థలు దోపిడీ చేసుకునే వనరుగా భావిస్తూ ఇదే విధానాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని మార్చాలంటే దేశ అభివృద్ధి నమూనాలోనే మౌలిక మార్పులు అవసరం.అందులో భాగంగా ముందుగా, పనులు పూర్తయిన తర్వాత పర్యావరణ అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రద్దు చేయాలి. ప్రజాభిప్రాయ సేకరణకు గతంలో అమల్లో ఉన్న 30 రోజుల గడువును పునరుద్ధరించాలి. స్థానిక ప్రాంతాల్లో చేపట్టే భారీ ప్రాజెక్టుల విషయంలో అక్కడి ప్రజలకు నిర్ణయాత్మక హక్కు కల్పించాలి. పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన, భూకంప ముప్పు అధికంగా ఉన్న హిమాలయ, ఈశాన్య ప్రాంతాల్లో కొత్త భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంపై తక్షణమే నిషేధం విధించాలి. వాటికి బదులుగా నదుల సహజ ప్రవాహానికి భంగం కలిగించని సూక్ష్మ జలవిద్యుత్ ప్రాజెక్టులు, రన్ ఆఫ్ ది రివర్ సాంకేతికతలకు

# వరి సాగుకే మొగ్గు...



నిజామాబాద్, ఎల్ నినో ప్రభావం ఆగస్టు సెప్టెంబర్ నెల్లలో తీవ్రమవుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ రైతులు మాత్రం వెనక్కి తగ్గకుండా వరి సాగు వైపే భారీగా మొగ్గు చూపుతున్నారు. గత వారం జూలై 22 నాటికి రాష్ట్రవ్యాప్తంగా పదకొండు లక్షల రెండు వేల ఎకరాల్లో మాత్రమే ఉన్న వరి సాగు కేవలం ఒక్క వారంలోనే అనూహ్యంగా ఇరవై లక్షల నలభై ఆరు వేల ఎకరాలకు విపరీతంగా పెరిగిపోయింది. ప్రత్యామ్నాయ పంటలను వేయాలని ప్రభుత్వ అధికారులు పదే పదే సూచించినప్పటికీ కందులు పెసలు మినుములు సోయాబీన్ తో పాటు వరినే రైతులు ప్రధానంగా ఎంచుకున్నారు. జూన్ రెండో వారం నుంచి వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ఆందోళన చెందిన అన్నదాతలు బోరు బావుల కింద నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. గత ఇరవై మూడో తేదీ వరకు సరైన వర్షాలు లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించినా ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతన్నల్లో మళ్లీ ఆశలు పూర్తిగా చిగురించాయి.నాలుగైదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పాటు గోదావరి కృష్ణా నదుల్లోకి నీటి ఇన్‌ఫ్లో భారీగా పెరుగుతుండటంతో ఎల్ నినో భయాలన్నీ ఒక్కసారిగా తొలగిపోయాయి. దీనితో మెదక్ ఆసిఫాబాద్ నిజామాబాద్ కామారెడ్డి సంగారెడ్డి కొత్తగూడెం తదితర జిల్లాల్లో డెబ్బై ఐదు శాతానికి పైగా భూములు సాగులోకి వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలో మూడు లక్షల ముప్పై వేలకు పైగా కామారెడ్డిలో రెండు లక్షల రెండు వేలకు పైగా కరీంనగర్ లో లక్షా నలభై తొమ్మిది వేలకు పైగా ఎకరాల్లో వరి పంట సాగైంది. ఆదిలాబాద్ జిల్లాలో అంచనా వేసిన దానికంటే ఎక్కువగా నూటఒక శాతం మేర సాగు విస్తీర్ణం నమోదైంది. అయితే నల్లగొండ సూర్యాపేట భువనగిరి వనపర్తి నాగర్‌కర్నూల్ ములుగు జగిత్యాల తదితర జిల్లాల్లో మాత్రం నలభై శాతం కూడా మొత్తం పంటల విస్తీర్ణం దాటలేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ రంగారెడ్డి ఖమ్మం జిల్లాల్లో సంతృప్తికరమైన వర్షాలు పడకపోవడంతో వరి నాట్లు ఇంకా పూర్తిగా పూర్తికాలేదు.వరి సాగులో ఎప్పుడూ ముందుండే నల్లగొండ జిల్లాలో ఈసారి పరిస్థితి చాలా దారుణంగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల నలభై ఒక్క వేల ఎకరాల్లో వరి పంట సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం ఎనభై వేల ఎకరాలలోపే పరిమితమైంది. అంటే కేవలం పదిహేను శాతం మాత్రమే వరి సాగు జరిగినట్లు స్పష్టమవుతోంది. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు విత్తనపు వడ్లు తెచ్చి ఇంట్లోనే పెట్టుకున్నప్పటికీ ప్రాజెక్టుల్లో నీటిమట్టం పడిపోవడంతో నారు పోయడానికి తీవ్రంగా వెనకాడారు. పత్తి సాగు కూడా ఐదు లక్షల యాభై ఐదు వేల ఎకరాలకే పరిమితమైంది. ఇక్కడి ప్రాజెక్టుల్లో నీరు అడుగంటిపోవడం వలన జిల్లా వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకుపోయింది. రాబోయే రోజుల్లో కనుక భారీ వర్షాలు కురవకపోతే నల్లగొండలో పంటలు కోలుకోవడం చాలా కష్టమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ప్రభుత్వం గత కొన్ని వారాలుగా ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గుతాయని రిజర్వాయర్లలో నీరు ఉండదని పదే పదే హెచ్చరించింది. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం వల్ల ఆ దిశగా కొంత మేర విస్తీర్ణం పెరిగింది. అయితే వర్షాలు పడటంతో ఆశపడిన రైతులు ప్రత్యామ్నాయాలతో పాటు తమకు అలవాటైన వరి సాగు వైపే పరుగులు తీశారు. కొన్ని జిల్లాల్లో పంటల సమయం ముగిసిపోతుందనే ఆందోళన మరోవైపు వర్షాలు సరిగా లేవనే దిగులు రైతులను అయోమయంలో పడేశాయి. ఇప్పుడు పడుతున్న వర్షాలు పంట చేతికి వచ్చే వరకు ఉంటాయో లేదోనని రైతన్నలు తీవ్రంగా మథనపడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో గత ఏడాది మూడు లక్షల డెబ్బై రెండు వేల ఎకరాల్లో సాగు జరిగితే ప్రస్తుతం మూడు లక్షల ముప్పై వేల ఎకరాలకు పడిపోయింది. కామారెడ్డిలో మాత్రం గత ఏడాది లక్షా అరవై నాలుగు వేల ఎకరాల నుంచి ఈసారి రెండు లక్షల రెండు వేలకు పెరిగింది.

# మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో కీలక ముందడుగు

విజయవాడ, అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. భూసేకరణ వల్ల స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి తగిన పరిహారం , పునరావాసం కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం.దీనికి సంబంధించి త్వరలోనే ప్రభావిత ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు.విజయవాడ మెట్రో మొదటి విడత నిర్మాణంలో భాగంగా రెండు ప్రధాన కారిడార్లను ప్రతిపాదించారు. మొదటి కారిడార్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించి ఉండగా.. రెండో కారిడార్ ఖఔహ నుండి పెనమలూరు వరకు సాగనుంది. ఈ రెండింటికీ ప్రధాన రవాణా కేంద్రమైన పండిట్ నెహ్రు బస్ స్టుషన్ వద్దే రెండు ప్రత్యేక మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లతో పాటు గన్నవరం ఎయిర్‌పోర్టును మెట్రో ద్వారా అనుసంధానించడం వల్ల ప్రయాణికులకు సత్వర , సునాయాస రవాణా వసతి లభించనుంది.గతంలో నిలిచిపోయిన ఈ మెట్రో ప్రాజెక్ట్‌ను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో విజయవాడ , అమరావతి పరిసర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు అవసరమైన అనుమతులు, డిజైన్లు , భూసేకరణకు సంబంధించిన పనులు సమాంతరంగా జరుగుతుండటం ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ , ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన వెంటనే భూసేకరణ తుది ప్రక్రియ ప్రారంభమై, విజయవాడ మెట్రో నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

# నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లోకేష్ క్రియాశీలక పాత్ర పోషిస్తుండటం అందరికి తెలిసిందే. అధికార పక్షంలో ఆయనే కీలకమయ్యారు. ప్రతిపక్షం కూడా ఆయన పైనే గురి పెట్టింది. దాంతో లోకేష్ గ్రాఫ్ పెరిగింది.ముఖ్యమంత్రి చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దాటాయి. ఇప్పటికే అయన నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. 16 ఏళ్ళు ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. అయితే రాబోయే కాలంలో తన కుమారుడు లోకేష్ ను ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నట్టు చెబుతున్నారు.ఇప్పటికే టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ పదవి అప్పజెప్పారు. పార్టీ కీలక అంశాలని కుమారుడికి అప్పగించేశారు. ఇక మిగిలింది పట్టాభిషేకం. పరిపాలనా అనుభవం కోసం విదేశాలు తిప్పుతున్నారు. తరచుగా ఢిల్లీకి పంపిస్తున్నారు. కేంద్రంలోని మంత్రులతో మాట్లాడిస్తున్నారు. ప్రభుత్వంలో తీసుకునే కీలక నిర్ణయాలలో లోకేష్ ను ఇన్వాల్వ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాబోయే కాలంలో లోకేష్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తుంది.ప్రతిపక్ష వైసీపీ లోకేష్ ను టార్గెట్ చేసుకొని రాజకీయాలు చేస్తుండడం గమనించవచ్చు. నిన్నా మొన్నటి వరకు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించిన వైసీపీ ఇప్పుడు డీఎస్సి అక్రమాల గురించి పోరాటం స్టార్ట్ చేసింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలోనే లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేసింది.అంటే భవిష్యత్తులో తాము లోకేష్ తోనే పోరాడాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థిర నిర్ణయానికి వచ్చారని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను సైతం పక్కన పెట్టి లోకేష్ పై బాణం ఎక్కు పెట్టడం దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు . మొత్తం మీద అటు అధికార పార్టీ లోకేష్ చుట్టూ తిరుగుతుంటే ఇటు ప్రతిపక్షం కూడా లోకేష్ కేంద్రంగానే విమర్శలు గుప్పిస్తుండడం విశేషం.

## టైర్ 1 సిటీగా మారుతున్న విశాఖ

విశాఖపట్టణం,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం ఇప్పుడు కేవలం మాటలకే పరిమితం కాకుండా, కళ్లముందే నిజమై కనిపిస్తోంది. ఒకప్పుడు సాధారణంగా ఉన్న రహదారులు నేడు విశాలమైన నేషనల్ హైవేలుగా మారుతుంటే, ఏళ్ల తరబడి ఖాళీగా పడి ఉన్న భూములు ఇప్పుడు పరిశ్రమలతో కళకళలాడుతున్నాయి. సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పాఠశాలలు డిజిటల్ తరగతులుగా రూపాంతరం చెందుతున్నాయి. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో ఆధునిక వసతులతో ఫిషింగ్ హార్బర్లు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి రంగంలోనూ వస్తున్న ఈ మార్పులు రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలకు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి.ఈ ప్రగతికి సాగరతీర నగరం విశాఖపట్నం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఎన్నో ఆకర్షణీయమైన ప్రకటనలు వచ్చినప్పటికీ, ఆచరణలో అనుకున్నంత పురోగతి కనిపించలేదు. కానీ ఇప్పుడు విశాఖ నగరం కొత్త రూపు దిద్దుకుంటోంది. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టులతో పాటు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో వైజాగ్ ప్రాంతం పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ప్రకటనల స్థానంలో క్షేత్రస్థాయి ఫలితాలు కనిపిస్తుండటంతో నగర రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు వేగంగా లభిస్తుండటంతో పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నారు. భూముల కేటాయింపు నుంచి పనుల ప్రారంభం వరకు ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల నిన్నటివరకు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు కార్పొరేట్ ఆఫీసులు, పరిశ్రమలతో నిండిపోతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువత.. మళ్లీ సొంత రాష్ట్రానికే తిరిగి వచ్చి ఉద్యోగాలు సాధించే వాతావరణం నెలకొంటోంది.కేవలం పెద్ద ప్రాజెక్టులే కాకుండా విద్య, నైపుణ్య శిక్షణ, తీర ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారు.ఐటీఐల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్ర తీరాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ మత్స్యకారుల సంక్షేమం నుంచి విదేశీ ఎగుమతుల వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఈ పురోగతి కేవలం ఒక నినాదం కాదు.. అది నిర్మిస్తున్న రహదారులు, తీర్చిదిద్దుతున్న తరగతి గదులు, యువతకు లభిస్తున్న ఉద్యోగాల రూపంలో

# వైసీపీలో అనూహ్య పరిణామాలు.. విజయసాయి రీఎంట్రీపై విస్తృత ప్రచారం!



అమరావతి,వైసీపీలో అంతర్గత రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఒకప్పుడు పార్టీలో నెంబరు 2గా ఉంటూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి పార్టీలోకి మళ్లీ వస్తారంటూ రెండు రోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. విజయసాయి నిష్క్రమణ తర్వాత ఢిల్లీ స్థాయిలో పార్టీ వ్యవహారాలను నడపడం క్లిష్టంగా మారిందని అంటున్నారు. దీంతో మాజీ ఎంపీని తిరిగి పార్టీలోకి తీసుకువచ్చి ఢిల్లీ వ్యవహారాలను అప్పగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీలో చేరనున్నారనే ప్రచారం రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. ఈ ప్రచారాన్ని అటు విజయసాయిరెడ్డి కానీ, ఇటు వైసీపీ అధిష్టానం కానీ ఖండించలేదు. దీంతో మాజీ ఎంపీ తిరిగి పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానిస్తున్నారు. అయితే ఈ ప్రయత్నం ఎక్కడి నుంచి మళ్లీ మొదలైంది అన్న విషయంపై స్పష్టత లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీలో తన మాటకు విలువ నివ్వడం లేదని, అధినేత జగన్ కు తనకు మధ్య బలమైన కోటరీ అడ్డుగా నిలుస్తోందని ఆరోపిస్తూ విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. అంతేకాకుండా రాజకీయాలకే గుడ్ బై చెప్పేశారు. ఆ తర్వాత పార్టీలో పరిణామాల పట్ల, జాతీయ రాజకీయ వ్యవహారాలపై సోషల్ మీడియా వేదికగానే తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.కొన్నిసార్లు అధినేత జగన్ వ్యవహారశైలిని తప్పుబడుతూ విజయసాయిరెడ్డి ట్వీట్లు చేసినా, అదంతా అభిమానంతో చేసిన కామెంట్లుగానే వైసీపీ నాయకులు భావిస్తున్నారని అంటున్నారు. పార్టీలో లోపాలను సరిదిద్దుకోవాలని విజయసాయిరెడ్డి చేసిన సూచనలుగానే పరిగణిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక రాజకీయాలకు దూరంగా ఉంటున్న విజయసాయిరెడ్డి మళ్లీ పార్టీలో చేర్చుకోవాలనే అధిష్టానం భావించడానికి కూడా బలమైన కారణాలు ఉన్నాయని అంటున్నారు. ఇందుకు విజయసాయిరెడ్డి సమర్థత కూడా ప్రధాన కారణంగా విశ్లేషిస్తున్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్ పక్కనే ఉంటూ వచ్చిన విజయసాయిరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పార్టీని పటిష్ట పరిచారని, అదే సమయంలో ఢిల్లీలో తనకున్న పరిచయాలతో బీజేపీతో సత్సంబంధాలు ఏర్పడేలా చక్రం తిప్పారని గుర్తు చేస్తున్నారు. విజయసాయిరెడ్డి రాజీనామా తర్వాత ఈ పని సరిగా సాగడం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి నలుగురు లోక్ సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉన్నప్పటికీ వారు కేంద్రంతో బలమైన రాజకీయ సంబంధాలు నెరపడంలో అంతగా ఫలితాలు సాధించలేకపోతున్నారని అధినేత జగన్ భావిస్తున్నారని అంటున్నారు.ఇదే సమయంలో గతంలో విజయసాయిరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకుని, ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని అధినేత తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి కూడా అధినేత అవసరాన్ని గుర్తించి తిరిగి పార్టీలోకి వచ్చేందుకు సముఖత వ్యక్తం చేశారని అంటున్నారు. దీంతో పార్టీలో పరిణామాలు శరవేగంగా మారుతున్నాయని చెబుతున్నారు. అధినేత, విజయసాయిరెడ్డి మధ్య పెద్దగా వివాదం ఏదీ లేకపోవడం, పార్టీ నుంచి బయటకు వెళ్లిన తర్వాత విజయసాయిరెడ్డి ఏ పార్టీలో చేరకపోవడం వల్ల ఆయనను తిరిగి చేర్చుకోవడంపై పెద్దగా అభ్యంతరాలు లేవని అంటున్నారు. ప్రధానంగా పార్టీకి విజయసాయిరెడ్డి అవసరం ఎక్కువగా ఉండటం కూడా ఆయన పునరాగమనానికి ప్రాధాన్యం ఏర్పడిందని అంటున్నారు. అయితే ప్రస్తుతం ఇరువర్గాల మధ్య సమాలోచనలు మాత్రమే జరుగుతున్నాయని, తుది నిర్ణయం జరగడానికి మరికొంత సమయం పడుతుందని భావిస్తున్నారు.

# బీజేపీ పార్టీ కి ఈటలలకు భారీ షాక్..

హుజూరాబాద్, ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో నందినగర్ నివాసం లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సిరిసేడు సర్పంచ్ కుమార్ -శ్యామల వంతడువుల సర్పంచ్ రాజేష్ -మాధవి టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల మనసుల్లో ఇప్పటికీ చెక్కుచెదరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ కూడా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రాజకీయాలకే పరిమితమైందని అన్నారు.కాంగ్రెస్, బీజేపీ పాలనలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, గ్రామస్థాయిలో ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు.

# ఉత్తరాదిన మోడీ ఇమేజ్‌కు యూత్ చెక్ పెడుతున్నారా?

న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పరిణామాలను గమనిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇమేజ్‌కు యువత పెద్ద ఎత్తున చెక్ పెడుతున్నట్టు కనిపిస్తోంది. మహారాష్ట్రలో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవ స్థాపకుడు అభిజిత్ దీప్కే, ఢిల్లీలో సౌరవ్‌దాస్, బీహార్‌లో ప్రశాంత్ కిషోర్.. పంజాబ్, హరియాణాలో కాక్రోచ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున మోడీకి ఇబ్బందిగా పరిణమించారన్న వాదన వినిపిస్తోంది. అది ప్రస్తుత పరిస్థితిలో ఒక అసాధారణమని కూడా అంటున్నారు.



ఉత్తరాది ప్రభావానికి..

ఉత్తరాదిపైనే బీజేపీ రాజకీయాలు ఎక్కువగా సాగుతున్నాయి. అయోధ్య రామమందిరం కావొచ్చు.. యూపీ పాలన కావొచ్చు.. మోడీ ప్రభను భారీగా పెంచాయి. యూపీ సహా.. ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ వికాసానికి కూడా ఇవన్నీ దోహదపడ్డాయి. అయితే.. ఇప్పటి వరకు ఉన్న పరిస్థితి వేరు.. భవిష్యత్తు వేరనే విధంగా ప్రస్తుతం సంకేతాలు వస్తున్నాయి. ముఖ్యంగా యువతలో వస్తున్న మార్పు.. దీనికి కారణంగా కనిపిస్తోంది. సంప్రదాయ ఓటు బ్యాంకుకు భిన్నంగా యువత ఆలోచనలో మార్పు వస్తోంది.తాజాగా గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్‌లోని ఒక్కొక్క అసెంబ్లీస్థానానికి ఉప ఎన్నిక జరిగింది. అయితే.. గుజరాత్‌లో బీజేపీ తన సిట్టింగ్ సీటును నిలబెట్టుకున్నా.. గతంలో వచ్చిన మెజారిటీని ఇప్పుడు తెప్పించుకోలేక పోయింది. అలానే మధ్య ప్రదేశ్‌లో అధికారం లో ఉన్నప్పటికీ.. బీజేపీ తాజా ఉప పోరులో తన హవాను చాటలేకపోయింది. ఇక, బీహార్‌లో రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం బీజేపీకి చెమటలు పట్టించింది.కేవలం ఇవే కాదు.. భవిష్యత్తులో చాలా రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయి. వాటిని జయించడం.. అంటే.. ఈ పరిణామాలను గమనిస్తే.. బీజేపీకి, ముఖ్యంగా మోడీకి కూడా ఇబ్బంది తప్పదని అంటున్నారు పరిశీలకులు. ఇది యువతలో వస్తున్న ఆలోచనా ధోరణికి అద్దం పడుతోందని చెబుతున్నారు. ఒకప్పుడు ప్రత్యామ్నాయాలు లేక పోవడంతో యువత ఏదో ఒక పార్టీకి ఓటేసే పరిస్థితి కనిపించింది. కానీ.. ఇప్పుడు ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఉన్నాయి. వీటికితోడు ఆలోచన చేస్తున్న యువత కూడా కనిపిస్తోంది. దీంతో మోడీకి మునుపటి కంటే.. ముందు ముందు.. మరిన్ని చిక్కులు తప్పవన్నది విశ్లేషకుల అంచనా.

# విజయ్,ఉదయనిధి..ఇద్దరు మిత్రుల శత్రుత్వ రాజకీయం!



చెన్నై:తమిళనాడు రాజకీయాల్లో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు చూస్తుంటే దశాబ్దాల నాటి కరుణానిధి వర్సెస్ జయలలిత పగ, ప్రతీకార రాజకీయం మళ్లీ కొత్త వెర్షన్‌లో పునరావృతమవుతున్నట్లు స్పష్టమవుతోంది. సీఎం విజయ్ ప్రభుత్వాన్ని, ఆయన వ్యక్తిగత అంశాలను లక్ష్యంగా చేసుకుని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు చేయడం, దానికి ప్రతిగా ఉదయనిధిని అరెస్టు చేయించి తంజావూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాత వ్యవహారాలను గుర్తు చేసుకుంటున్నారు.

ఉదయ్, స్టాలిన్ చిన్ననాటి స్నేహితులు

బయట రాజకీయం కోసం ఒకరిపై ఒకరు తీవ్రంగా విమర్శలు గుప్పించుకుంటున్న విజయ్, ఉదయనిధి స్టాలిన్‌లు ఇద్దరూ చిన్ననాటి క్లాస్‌మేట్స్. చెన్నైలోని డాన్ బోస్కో పాఠశాలలో కలిసి చదువుకున్న పాత మిత్రులే! అంతేకాదు, సినీ పరిశ్రమలో ఉన్న సమయం నుంచి రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా విజయ్ సినిమాల డిస్ట్రిబ్యూషన్‌లో ఉదయనిధి కీలక పాత్ర పోషించారు. అలాంటి పాత మిత్రులు నేడు ఒకరు సీఎం పీఠంపై, మరొకరు ప్రతిపక్ష నేతగా ఉండి ఇలా ముఖాముఖి పోరుకు దిగడం, కేసులు-అరెస్టుల వరకు వెళ్లడం వెనుక వ్యక్తిగత కక్షల కంటే రాజకీయ వ్యూహాలే ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి.

స్టాలిన్ సహకారంతోనే సీఎం అయిన విజయ్

అసలు ఎం.కె. స్టాలిన్ వ్యూహాత్మక సహకారం లేకపోతే విజయ్ అంత సులువుగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేవారే కారు. జయలలిత మరణం తర్వాత ఏఐడీఎంకే బలహీనపడటం, డీఎంకే పాలనపై పెరిగిన అసంతృప్తిని దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం ద్వారా సమర్థవంతంగా క్యాష్ చేసుకున్నారు. పాత ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి స్వస్తి పలకాలన్న సంకల్పంతో విజయ్ అధికారంలోకి వచ్చినప్పటికీ, అన్నాడీఎంకేను నిరంతరం డిఫెన్స్‌లో నెట్టడానికి ఇరుపక్షాలు ఈ పొలిటికల్ డ్రామాను వాడుకుంటున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

టీవీకే వర్సెస్ డీఎంకేగా రాజకీయం మార్చే ప్లాన్?

ఈ పరిణామాలన్నీ చూస్తుంటే.. నాడు అర్ధరాత్రి వేళ కరుణానిధిని జయలలిత ప్రభుత్వం అరెస్టు చేయించిన సంఘటనలు, ఆ తర్వాత జయలలితపై కరుణానిధి కేసులు పెట్టిన పాత చరిత్రే గుర్తుకొస్తోంది. తమిళనాడు ఓటర్లను ౦ఎఖ వర్సెస్ ఐవీఖ చుట్టూ తిప్పడానికి, మూడో శక్తిగా ఎదగాలని చూస్తున్న బీజేపీ లేదా ఏఐడీఎంకేలను అసలు పొలిటికల్ రేసులోనే లేకుండా చేయడానికి ఈ అరెస్టు డ్రామా ఒక పర్‌ఫెక్ట్ ప్లాన్లా ఉపయోగపడుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే, విమర్శలు-అరెస్టుల ద్వారా ఇద్దరు మిత్రులూ తమ తమ ఓటు బ్యాంకులను పదిలపరుచుకునే రాజకీయ వ్యాపారంలో మునిగితేలుతున్నారన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. ఉదయనిధి అరెస్ట్ ద్వారా డీఎంకే కేడర్‌లో సానుభూతిని రగిలించడం, మరోవైపు చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నాననే ముద్రతో విజయ్ తన సీఎం ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసుకోవడం ఈ గేమ్ ప్లాన్ వెనుక ఉన్న అసలు మాస్టర్ మైండ్ వ్యూహం.

# ఓఆర్ఆర్ చుట్టూ రియల్...



హైదరాబాద్, హైదరాబాద్ మహానగరం నలువైపులా శరవేగంగా విస్తరిస్తుండటం తో స్థిరాస్థి రంగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఔటర్ రింగ్ రోడ్ ను దాటి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ దిశగా నగరం అడుగులు వేస్తుండటంతో, ఓఆర్ఆర్ , ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న శాటిలైట్ ప్రాంతాలు ప్రాపర్టీ పెట్టుబడులకు హాట్‌స్పాట్‌లుగా మారుతున్నాయి. ముఖ్యంగా షాద్‌నగర్, భువనగిరి, సంగారెడ్డితో పాటు తూర్పు హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్, ఉప్పల్-వరంగల్ నేషనల్ హైవే కారిడార్ల పరిసరాల్లో నూతన రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఊఓఆం, ఆఅఖ ఆమోదం పొందిన ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఒక్కసారిగా పుంజుకుంది.భవిష్యత్తు రవాణా అవసరాలను తీర్చేందుకు ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మాణం కానుండటం, పారిశ్రామిక ప్రాజెక్టుల విస్తరణ, డిజిటల్, డేటా సెంటర్ల రాక వంటి కీలక అంశాలు ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన చోదక శక్తులుగా నిలుస్తున్నాయి. వ్యాపారవేత్తలు, మధ్యతరగతి ఉద్యోగులు తక్కువ ధరలోనే లభించే ఓపెన్ ప్లాట్లలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఓఆర్ఆర్ దాటి కొన్ని నిమిషాల ప్రయాణ వ్యవధిలోనే ప్రధాన నగరానికి చేరుకునేలా మెరుగైన ఫోర్-లేన్, సిక్స్-లేన్ రహదారుల అనుసంధానం ఏర్పడటం వీరికి అదనపు ప్రయోజనంగా మారింది.దక్షిణాన షాద్‌నగర్-జడ్చర్ల బెల్ట్ బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో పాటు సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌ల కారణంగా ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పశ్చిమాన సంగారెడ్డి-ముంబై జాతీయ రహదారి పరిసరాలు కంది, ఐఐటీ హైదరాబాద్, పారిశ్రామిక జోన్లతో అనుసంధానమై ఉండటంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అలాగే తూర్పున భువనగిరి-ఘట్‌కేసర్ కారిడార్ ఎమ్స్ , మెట్రో విస్తరణ వార్తలతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులకు ప్రధాన కేంద్రంగా మారింది.మహానగరం అంచుల్లో కేవలం ప్లాట్లు మాత్రమే కాకుండా, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాలు కూడా వేగవంతమవుతున్నాయి. దీంతో రాబోయే 5 నుండి 10 ఏళ్ల కాలంలో ఆర్ఆర్ఆర్ సరిహద్దుల ప్రాంతాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో కీలకమైన ఆర్థిక, నివాస హబ్‌లుగా రూపాంతరం చెందుతాయని, ముందస్తుగా ఇక్కడ చేసే పెట్టుబడులు ఆస్తిపరులకు మంచి రాబడులను అందిస్తాయని అంచనా వేస్తున్నారు.

# పెట్రోల్ పొందాలంటే ఇన్స్యూరెన్స్ తప్పనిసరి..

న్యూఢిల్లీ,దేశంలో బీమా (ఇన్స్యూరెన్స్) లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరైన రక్షణ లేని వాహనాలను అడ్డుకోవడానికి సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

ఇన్స్యూరెన్స్ లేకపోతే ఇంధనం నిరాకరణ

దేశవ్యాప్తంగా థర్డ్ పార్టీ మోటార్ ఇన్స్యూరెన్స్ లేని వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయడాన్ని నిలిపివేసే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు “నో ఇన్స్యూరెన్స్, నో ఫ్యూయల్” అనే నిబంధనను తీసుకురావాలని ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కరోల్,జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కీలక విచారణ చేపట్టింది. ప్రస్తుతం దేశంలో సగానికి పైగా వాహనాలు మోటారు వాహనాల చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ, ఎలాంటి బీమా కవరేజ్ లేకుండానే ప్రయాణిస్తున్నాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిస్థితి రోడ్డు ప్రమాద బాధితులకు తీవ్ర అన్యాయం చేస్తోందని



పైలట్ ప్రాజెక్టుగా అమలుకు సూచన

ఈ సమస్యను సమర్థవంతంగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుగా ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. ముఖ్యంగా జాతీయ రహదారులు, తరచుగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్, మరియు టోల్ ప్లాజాల పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని స్పష్టం చేసింది.

# వివాదాలతో వార్తల్లో నిలవడమే గొప్ప నాయకత్వ లక్షణమా?



చెన్నై:రాజకీయాల్లో నిరంతరం ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్య చేస్తూ వార్తల్లో నిలవడమే గొప్ప నాయకత్వ లక్షణమా? ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత దాడి చేస్తూ..అభ్యంతరకర కామెంట్లు చేస్తే ప్రజలు నిజంగానే మెచ్చుకుంటారా? ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు ఇదే పెద్ద ప్రశ్నగా మార్చాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ - నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే యువనేత ఉదయనిధి స్టాలిన్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు.. ఆ తర్వాత ఆయన అరెస్టు కావడం వంటి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపాయి. అయితే ఈ తరహా దూకుడు రాజకీయాలు యువనాయకుడికి సీఎం పీఠాన్ని తెచ్చిపెడతాయా లేక ప్రతికూలంగా మారుతాయా అనేది విశ్లేషించాల్సిన అంశం.ఉదయనిధి స్టాలిన్ వివాదాలకు కేంద్రబిందువుగా మారడం ఇదే మొదటిసారేమీ కాదు. గతంలో ఏఐఏడీఎంకే నేత శశికళ కాళ్లను తాకడానికి అప్పటి సీఎం పళనిస్వామి ప్రయత్నించారని వ్యాఖ్యానించి పరువు నష్టం దావాను ఎదుర్కొన్నారు. ఆ తర్వాత సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో పోల్చి దేశవ్యాప్తంగా పెద్ద వివాదానికి తెరలేపారు. తాజాగా ఇప్పుడు సీఎం విజయ్ వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో అరెస్టు వరకు వెళ్లారు. శశికళ, సనాతనం నుంచి నేటి త్రిష ఎపిసోడ్ వరకు ఆయన నిరంతరం వివాదాలకు కేరాఫ్ గా వార్తల్లో నిలుస్తూ వస్తున్నారు.వరుస వివాదాలతో మీడియా దృష్టిని, ప్రజల శ్రద్ధను తనవైపు తిప్పుకోవడంలో ఉదయనిధి సక్సెస్ అయి ఉండవచ్చు. ఈ అరెస్టుతో పాజిటివ్‌గానో... నెగెటివ్‌గానో ఆయన పేరు తమిళనాడు అంతటా గట్టిగా మార్మోగింది. అయితే కేవలం సంచలనాత్మక వ్యాఖ్యలు చేయడం... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యక్తిగత దూషణలకు దిగడం వల్ల ఒక నాయకుడికి పరిణతి ఉందనే భావన ప్రజల్లో కలుగుతుందా అనేది సందేహమే. కేవలం వివాదాలు సృష్టించడం వల్ల తాత్కాలికంగా పబ్లిసిటీ వచ్చినా... అది ఒక నాయకుడికి ఆమోదయోగ్యతను.. ముఖ్యమంత్రి స్థానానికి కావాల్సిన గౌరవాన్ని తెచ్చిపెట్టదు.ఈ కొత్త రాజకీయ పరిణామాల నుంచి నేటి తరం యువత.. వర్ధమాన రాజకీయ నాయకులు నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ప్రజా సమస్యలపై పోరాడటం... విధానపరమైన విమర్శలు చేయడం రాజకీయాల్లో ఆరోగ్యకరమైన పద్ధతి. కానీ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను, మహిళల గౌరవాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం ఏమాత్రం శ్రేయస్కరం కాదనే సందేశం ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. రాజకీయం అనేది వ్యక్తిగత కక్షసాధింపుల వేదికగా కాకుండా ప్రజా సంక్షేమం చుట్టూ తిరిగినప్పుడే నాయకుడికి నిజమైన గుర్తింపు లభిస్తుంది.భవిష్యత్తులో సీఎం విజయ్ తర్వాత స్థానాన్ని భర్తీ చేసే అర్హత లేదా సీఎం అయ్యే అవకాశాలు ఉదయనిధికి ఉన్నాయా అంటే.. అది కేవలం ఆయన చేసే వివాదాస్పద వ్యాఖ్యలపై కాకుండా.. ఆయన చూపించే పాలనా పరిణతి, ప్రజాదరణపైనే ఆధారపడి ఉంటుంది. ప్రతిపక్ష నాయకుడిగా నిలకడైన వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తేనే ప్రజలు ఆయనను కాబోయే సీఎంగా స్వీకరిస్తారు. అలా కాకుండా కేవలం నోటి దూకుడు, వివాదాస్పద శైలినే నమ్ముకుంటే అది ఉదయనిధి రాజకీయ భవిష్యత్తుకే ముప్పుగా మారే ప్రమాదం ఉంది.

# మరో 15 ఏళ్లు అధికారంలో ఉండాలి

అమరావతి,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరో 15 సంవత్సరాలు కొనసాగాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజలు ఈ విషయంలో ఆలోచన చేయాలని, వైకుంఠపాళీ రాజకీయాలు చేస్తే.. రాష్ట్రం ఎప్పటికీ.. అభివృద్ధి చెందదని అన్నారు. 2019-24 మధ్య ప్రజలు భయంతో, రాష్ట్రంలో విధ్వంసంతో జీవనం గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలో 2024లో ఎన్డీఏ విజయం ఊహించని విప్లవం. అధికారంలోకి వచ్చాక 7 శ్వేత పత్రాలు ఇచ్చామన్నారు.ఒక ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తే ఎలా ఉంటుందో భోగాపురం విమానాశ్రయం ఓ ఉదాహరణగా చంద్రబాబు పేర్కొన్నారు. డేటా సెంటర్లు, ఐటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, స్టీల్ పరిశ్రమలతో ఓ గ్రోత్ ఇంజన్‌గా మారుతోందన్నారు. 2014లో విభజన తర్వాత ఏపీ పరిస్థితి వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మారిందన్నారు. 58 శాతం మంది జనాభా ఉంటే 46 శాతమే వనరులు ఉన్నాయని తెలిపారు. రాజధాని లేకుండా పోయిందన్నారు. విభజన సమయంలో ఆస్తుల పంపకం కూడా సవ్యంగా జరగలేదన్నారు.2019 తర్వాత రాష్ట్రం విధ్వంసానికి గురైందని పేర్కొన్న చంద్రబాబు అన్ని విధాలా రాష్ట్రం నష్టపోయిందన్నారు. ”వ్యవస్థలు కుప్పకూలాయి. శాంతిభద్రతలు లేవు. ఏపీ బ్రాండ్ దెబ్బతింది. పరిశ్రమలు పారిపోయాయి. 2024లో కూటమి అధికారంలోకి వస్తూనే ఏపీ బ్రాండ్ పునరుద్ధరించాం. సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధిని, ప్రాంతీయ సమతుల్యతను కాపాడాం. రాజధానితో పాటు పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పునర్నిర్మాణం చేపట్టాం. ప్రగతిశీల విధానాలతో పాటు క్వాంటం లాంటి టెక్నాలజీపై దృష్టి పెట్టాం” అని వివరించారు.




మీడియా కూడా..

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విషయంలో మీడియా కూడా ప్రజలకు వివరించే గురుతర బాధ్యతను తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. కేవలం వార్తలు రాయడమే కాకుండా.. ప్రజల్లో ఆలచన రేకెత్తించేలా కూడా సహకరించాలన్నారు. మీడియా తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని ఆయన వ్యాఖ్యానించారు. 2019-24 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ప్రజలను వేధించిన తీరుపై మీడియా కూడా ప్రజలకు వివరించాలన్నారు. ఆ ప్రభుత్వం ప్రజలను అణగదొక్కిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంచి చెడులను కూడా మీడియా ప్రస్తావించాలని కోరారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280